AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
11-5-2026 (Monday) MAIN EDITION

## టీవీకే మంత్రి జేబులో జయలలిత ఫొటో



**అక్షరటుడే, తమిళనాడు :** తమిళనాడులో అసెంబ్లీలో సోమవారం ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. టీవీకే మంత్రి సెంగోట్టయన్ మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఫొటోను జేబులో పెట్టుకొని ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. టీవీకే అధినేత విజయ్ ఆదివారం సీఎంగా ప్రమాణం చేయగా ఆయనతో పాటు 9 మంది మంత్రులు సైతం ప్రమాణ స్వీకారం చేశారు. అందులో సెంగోట్టయన్ కూడా ఉన్నారు. ఆయన తాజాగా జేబులో జయలలిత ఫొటో పెట్టుకొని ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. మరోవైపు స్టాలిన్ చిత్రంతో పన్నీర్ సెల్వం ప్రమాణం చేశారు.

## రష్మీ సంచలన పోస్టు



**అక్షరటుడే, హైదరాబాద్ :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ సాయిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యాంకర్ రష్మీ గౌతమి సంచలన పోస్టు చేశారు. భగీరథ్‌పై పోక్సో విషయంలో పలువురు ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. దీనిపై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. "నేను బీజేపీకి మద్దతు ఇస్తాను కానీ.. రేపిస్టులకు, లైంగిక వేధింపులకు పాల్పడేవారికి కాదని" పేర్కొన్నారు. తనను ట్యాగ్ చేసి దూషించడంతో ప్రయోజనం ఉండదన్నారు. ప్రభుత్వ అధికారులు, న్యాయవ్యవస్థను ట్యాగ్ చేసి న్యాయం కోరమని సూచించారు.

## అన్నాడీఎంకేలో ముసలం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం అనంతరం అన్నాడీఎంకే పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. మాజీ సీఎం ఎడప్పాడి కె పళనిస్వామి, సీనియర్ నేత సీవీ షణ్ముగం వర్గాల మధ్య ఆధిపత్య పోరు మొదలైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## మహబూబ్‌నగర్‌లో ఘోర ప్రమాదం



**అక్షరటుడే, మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలకొండ చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వేగంగా దూసుకొచ్చిన స్పోర్ట్స్ బైక్, యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొనడంతో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.

## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు : కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణ రక్షణ సేన భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు సూచనలు చేశారు. మే 20 నుంచి జూన్ 20 వరకు ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగుర వేయాలన్నారు.



## ట్రాఫిక్ సిగ్నల్ పోల్‌కు చిక్కుకున్న బైక్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కెనడాలో వింత రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాఫిక్ సిగ్నల్ పోల్‌కు బైక్ చిక్కుకుంది. బ్రిటిష్ కొలంబియాలోని సర్రేడెల్టా సరిహద్దు సమీపంలో జరిగిన ఈ ప్రమాద చిత్రాలు వైరల్ అవుతున్నాయి. బీఎండబ్ల్యూ కారును వేగంగా బైక్ ఢీకొట్టింది. అనంతరం గాలిలోకి ఎగిరి నేరుగా ట్రాఫిక్ సిగ్నల్ పోల్‌కు చిక్కుకుంది. ఈ ప్రమాదంలో బైకర్ తీవ్రంగా గాయపడగా, కారు డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు.

## పలు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో నడిచే పలు ఎంఎంటీఎస్ రైళ్లను రెండు రోజుల పాటు వివిధ కారణాలతో రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం, మంగళవారం పలు సర్వీసులను పూర్తిగా, కొన్నింటిని పాక్షికంగా రద్దు చేనస్తున్నట్లు పేర్కొన్నారు. లింగంపల్లి - ఫలక్‌నుమా, ఫలక్‌నుమా - లింగంపల్లి, ఉందానగర్ - లింగంపల్లి మధ్య నడిచే రైళ్లను రెండు రోజుల పాటు పూర్తిగా రద్దు చేశారు. సికింద్రాబాద్ ఫలక్‌నుమా, సికింద్రాబాద్ ఉందానగర్ మధ్య నడిచే కొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కేసు విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనికి కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వం వహించనున్నారు. ఈ కేసులో తక్షణమే విచారణ ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని ఆదేశించారు. దీంతో ఈ కేసులో తర్వాత ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# వెంటనే విచారణ చేపట్టాలి



■ బండి సంజయ్ కుమారుడి కేసుపై సీఎం ఆదేశం ■ సిట్ ఏర్పాటు చేసిన డీజీపీ ■ పార్టీకి సంబంధం లేదన్న బీజేపీ చీఫ్

బండి సంజయ్ కుమారుడు భగీరథ్ తమ కూతురును వేధించాడని ఓ బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పేట్ బషీర్‌బాద్ పోలీసులు ఆయనపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని సోషల్ మీడియాలో నెటిజన్లు మండిపడ్డారు. బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలని పలువురు డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేశారు. ఈ క్రమంలో తాజాగా సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

### సీఎం ఆరా

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ సాయిపై నమోదైన కేసులో తక్షణమే విచారణ ప్రారంభించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 8వ తేదీనే ఫిర్యాదు నమోదైనప్పటికీ, చర్యలు తీసుకోవడంలో జరిగిన జాప్యంపై ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీజీపీ వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన దృష్ట్యా మొత్తం పోలీస్ యంత్రాంగం భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉందని డీజీపీ తెలియజేశారు. దీంతో చర్యలు తీసుకోవడంలో ఆలస్యం అయిందన్నారు.

### హనీ ట్రాప్ అని..

బాలిక, ఆమె తల్లిదండ్రులు తనను హనీ ట్రాప్ చేశారని బండి సంజయ్ కుమారుడు ఆరోపించారు. తనను బ్లాక్ మెయిల్ చేశారని భగీరథ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కరీంనగర్ టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక, ఆమె తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరస్పరం కేసులు పెట్టుకోవడంతో సంచలనంగా మారింది. మరోవైపు తనను రాజకీయంగా ఎదుర్కోలేక కుట్ర పన్నారని బండి సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. నిజానిజాలను సిట్ అధికారులు తేల్చనున్నారు.

### బీజేపీకి సంబంధం లేదు

భగీరథ్‌పై నమోదు అయిన పోక్సో కేసు మీద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు స్పందించారు. చట్టం తన పని తాను చేసుకు పోతుందన్నారు. అది సంజయ్ కుటుంబంలో జరిగిన వ్యవహారం అన్నారు. పార్టీలో కాదని చెప్పారు. ఈ కేసులో ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలన్నారు.

### బీఆర్ఎస్ నిరసనలు

బండి సంజయ్ కుమారుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులు ఈ వ్యవహారంలో బీజేపీతో పాటు కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తున్నారు. రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉండటంతో భగీరథ్‌పై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా సీఎం ఆదేశం మేరకు డీజీపీ సీవీ ఆనంద్ సిట్ ఏర్పాటు చేశారు.

## మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు



**అక్షరటుడే, ఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. కాంప్రమైజ్‌డ్ అయిన ప్రధానికి దేశాన్ని నడపడం ఇక సాధ్యం కాదన్నారు. ఏడాది వరకు బంగారం కొనుగోలు చేయొద్దని, విదేశీ టూర్లకు వెళ్లొద్దని, పెట్రోల్, డీజిల్, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మోదీ కోరిన విషయం తెలిసిందే. దీనిపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. మోదీ చెప్పిన మాటలు ప్రబోధాలు కావని, వైఫల్యానికి నిదర్శనమని రాహుల్ గాంధీ అన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఎంతటి దుస్థితికి తెచ్చారంటే ఏమి కొనాలి, ఏమి కొనకూడదు, ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడికి వెళ్లకూడదు అని ప్రజలకు చెప్పాల్సి వస్తోంది. ప్రతిసారీ, వారు తమ జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి బాధ్యతను ప్రజలపైకి నెట్టేస్తున్నారు" అని విమర్శించారు.

## అస్సాం సీఎంగా రేపు హిమంత బిస్వా శర్మ ప్రమాణ స్వీకారం



**అక్షరటుడే, అస్సాం :** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిస్వా శర్మ మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనను సీఎంగా నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రమాణ స్వీకారం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గవర్నర్ తరపున అస్సాం నూతన ముఖ్యమంత్రి నియామక ఉత్తర్వులను జారీ చేసే అవకాశం లభించినందుకు తాను ఎంతో గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ట్వీట్ చేశారు. మే 12వ తేదీ ఉదయం 11:40 గంటలకు గౌహతిలోని ఖానాపారాలో ఉన్న వెటర్నరీ కళాశాల మైదానంలో సీఎం ప్రమాణ స్వీకారం చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, పలురాష్ట్రాల బీజేపీ సీఎంలు హాజరు కానున్నారు.


## పీఎంజే జువెల్లరీస్ దోపిడీ కేసు.. దొరికిన దొంగలు

**అక్షరటుడే, కరీంనగర్ :** కరీంనగర్ పీఎంజే జువెల్లరీస్ దోపిడీ కేసులో పోలీసుల కీలక పురోగతి సాధించారు. ఇందరు నిందితులతో పాటు బంగారం కొనుగోలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో గల పీఎంజే జ్యువెల్లరీస్‌లో ఈ నెల 3న దోపిడీ జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసును పోలీసులు సవాలుగా తీసుకున్నారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. దోపిడీకి పాల్పడింది అంతర్రాష్ట్ర ముఠాగా పోలీసులు గుర్తించారు. వారి కోసం ఇతర రాష్ట్రాల్లో సైతం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దోచుకున్న బంగారాన్ని బీహార్‌లో విక్రయిస్తుండగా పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు నిందితుల కొసం బెంగాల్, బీహార్‌లో గాలిస్తున్నారు.



## కొత్త లుక్‌లో డింపుల్

**హీరోయిన్ డింపుల్ హయాతి కొత్త లుక్‌లో ఆకట్టుకున్నారు. శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న భోగి సినిమాలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీ ఆగస్టులో విడుదల కానుంది. ఈ చిత్రంలో డింపుల్ లుక్‌ను తాజాగా మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో మందారం అనే బోల్డ్ పాత్రలో డింపుల్ హయాతి నటిస్తున్నారు. ఇందులో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోంది.** - అక్షరటుడే, సినిమా డెస్క్



## బెంగాల్ తొలి కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

**అక్షరటుడే, బెంగాల్ :** బెంగాల్ తొలి కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 45 రోజుల్లోగా సరిహద్దు కంచె కోసం బీఎస్ఎఫ్‌కు భూమి కేటాయించనున్నారు. రాష్ట్రంలో అన్ని కేంద్ర పథకాల అమలు చేయాలని నిర్ణయించారు. బీఎన్ఎస్ చట్టాన్ని అమలు చేయాలని, కేంద్ర శిక్షణకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఆమోదం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు ఉద్యోగం పొడిగిస్తామని ప్రకటించారు. హత్యకు గురైన బీజేపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయించారు.






## నీట్ ప్రశ్నాపత్రం లీక్ కలకలం

**అక్షరటుడే, రాజస్థాన్ :** నీట్ యూజీ 2026 పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ జరిగిందన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. పరీక్షకు ముందురోజే బయటకు వచ్చిన 'గెస్ పేపర్'లోని అనేక ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో సరిపోవడంతో రాజస్థాన్ పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ కేసులో పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మే 3న దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష నిర్వహించగా మే 2 రాత్రే కొందరు విద్యార్థులకు ఒక 'గెస్ పేపర్' సర్క్యులేట్ అయినట్లు సమాచారం. పరీక్ష పూర్తయ్యాక ఆ గెస్ పేపర్‌లోని ప్రశ్నలను అసలు ప్రశ్నపత్రంతో పోల్చి చూడగా, బయాలజీ, కెమిస్ట్రీ విభాగాల్లో 100కు పైగా ప్రశ్నలు దాదాపు పూర్తిగా సరిపోలినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.